సాక్షి
గుంటూరు
బుధవారం । 26 । ఫిబ్రవరి । 2025



మహాశివరాత్రి పూజలకు ఏర్పాట్లు

మాచర్ల: పట్టణంలోని పలు శివాలయాల్లో బుధవారం మహాశివరాత్రి పూజా కార్యక్రమాలను నిర్వహించటానికి ఏర్పాట్లు చేశారు. ఆయా దేవాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు.



కొలువైన శ్రీ బాలా త్రిపుర సుందరి

భట్టిప్రోలు(వేమూరు): పెదపులివర్రులోని బాలా త్రిపుర సుందరి సమేత రాజరాజ నరేంద్ర స్వామి ఆలయంలో సోమవారం రాత్రి శ్రీ స్వామి అమ్మ వార్లు మయూర వాహనంపై అధిరోహించి భక్తులకు దర్శనమిచ్చారు.

నేడు కనకదుర్గ ఆలయంలో శివరాత్రి

మంగళగిరి: పాత మంగళగిరి కనక దుర్గ ఆలయంలో బుధవారం శివ రాత్రి మహోత్సవం వైభవంగా నిర్వహి స్తామని ఆలయ కమిటీ మంగళ వారం ఒక ప్రక టనలో తెలిపింది.



న్యూస్‌రీల్

వ్యాఘ్ర వాహనంపై బాలచాముండేశ్వరిదేవి



అమరావతి: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అమరావతిలో వేంచేసియున్న బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి వారి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల భాగంగా మంగళవారం సాయంత్రం పెండ్లికుమారుడైన అమరేశ్వరుడిని పల్లకి వాహనంలో, పెండ్లి కుమార్తె బాలచాముండేశ్వరీదేవిని వ్యాఘ్ర వాహనంపై అత్యంత వైభవోపేతంగా పురవీధులలో ఊరేగించారు. ఆలయ ఈఓ కె.సునీల్‌కుమార్ మాట్లాడుతూ శివరాత్రి పర్వదినాన భక్తులకు బుధవారం తెల్లవారుజాము 3గంటల నుంచే దర్శనం కల్పిస్తామని, ఉచితంగా ప్రసాదాన్ని, తాగునీటిని అందిస్తామన్నారు. సాయంత్రం 4గంటల వరకు స్వామివారికి అభిషేకాలు నిర్వహిస్తామని తెలిపారు. 50వేల లడ్డూలను తయారు చేయించి భక్తులకు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ధ్వజారోహణ



అమరావతి: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అమరావతిలో వేంచేసియున్న బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి వారి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల భాగంగా సోమావారం రాత్రి శాస్త్రోక్తంగా అమరేశ్వరుని ధ్వజాపటారోహణ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో తొలుత గ్రామ పురోహితుడు కౌశిక కాశ్యాప అవధాని అగ్ని ప్రతిష్టాపన చేసి హోమం నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణానికి ముక్కోటి దేవతలను ఆహ్వానించే ప్రక్రియలో భాగంగా ధ్వజపటాన్ని ఆవిష్కరించి ధ్వజపటారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. అలాగే మంగళవారం ఉదయం స్వామి వారికి నిత్యహోమం నిర్వహించి బలిహరణా కార్యక్రమాన్ని పూర్తిచేశారు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో నేడు...

బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం బ్రహ్మోత్సవాల సందర్భంగా మహాశివరాత్రి పర్వదినాన ఉదయం 4గంటల నుంచి స్వామి వారికి అభిషేకాలు ప్రారంభిస్తామని ఈఓ సునీల్ కుమార్ తెలిపారు. రాత్రి 9గంటలకు లింగోద్భవకాలాన మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలను నిర్వహిస్తారన్నారు. రాత్రి ఒంటిగంటకు ఎదుర్కోల ఉత్సవం, రెండు గంటలకు స్వామివారి కల్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు.

వాహనాల రాకపోకలపై ఆంక్షలు

తెనాలిరూరల్: మహాశివరాత్రి సందర్భంగా తెనాలి నుంచి నారాకోడూరు వైపు వెళ్లే వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధిస్తున్నట్టు డీఎస్పీ జనార్ధనరావు మంగళవారం తెలిపారు. మంగళవారం ఆయ విలేకర్లతో మాట్లాడారు. 25వ తేదీ రాత్రి నుంచి 27వ తేదీ ఉదయం వరకు ఆటోలు, కార్లు, బస్సులు, లారీలను అనుమతించేదిలేదని చెప్పారు. గుంటూరు వెళ్లాల్సిన వారు నందివెలుగు రోడ్డువైపు వెళ్లాలన్నారు. అలానే ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో 28వ తేదీ సాయంత్రం వరకు 144 సెక్షన్ నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయని చెప్పారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలందరూ సహకరించాలని, తగిన బందోబస్తు ఏర్పాట్లు చేశామని డీఎస్పీ తెలిపారు.

ఓటు చెక్ చేసుకోండిలా..!



సత్తెనపల్లి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటు ఉందో లేదో సరి చూసుకునేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం హెల్ప్‌లైన్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రత్యేకంగా పట్టభద్రుల ఓటర్ల జాబితా ఉంటుంది. ఏపీ ఎన్నికల వెబ్‌సైట్‌లో ceoandhra. nic. in ద్వారా ఓటు వివరాలు తెలుసుకోవచ్చు. వెబ్ పేజీ ఓపెన్ చేయగానే కుడివైపు ఎమ్మెల్సీ రిజిస్ట్రేషన్ 2024 ఉంటుంది. దానిపై క్లిక్ చేయగానే నాలుగు ఐచ్ఛికాలు కనిపిస్తాయి. చివరి ఐచ్ఛికం సెర్చ్ యువర్ నేమ్ పై క్లిక్ చేయాలి. వివరాలతో పేజీ వస్తుంది. నియోజకవర్గం ఎంపిక చేసి ఓటు నమోదు చేసుకున్నప్పుడు వచ్చిన ఐడీ, ఇంటి నెంబర్, పేరులోని ఏదోక వివరాలతో ఓటు సరి చూసుకోవచ్చు. పోలింగ్ కేంద్రం, ఓటు సీరియల్ నెంబర్‌తో పాటు ఏ కేంద్రంలో ఏ గదిలో ఓటు హక్కువిని యోగించుకోవాలో తెలుస్తుంది.

కర్పూర గౌరం..
కరుణావతారం

నేడు మహాశివరాత్రి .. కోటప్పకొండ తిరునాళ్ల మహోత్సవం

- లక్షలాదిగా తరలిరానున్న భక్తజనం
- తిరునాళ్ల జాగరణలో ప్రత్యేక ఆకర్షణగా విద్యుత్ ప్రభలు
- చిలకలూరి పేట నుంచి భారీగా తరలిన ప్రభలు
- అమరావతిలో వ్యాఘ్ర వాహనంపై ఊరేగిన బాలచాముండేశ్వరి దేవి




కోటప్ప కొండపై ఆలయం వద్ద శివ కుటుంబం విగ్రహాలు

సాక్షి, నరసరావుపేట, నరసరావుపేట రూరల్: మహాశివరాత్రిని పురస్కరించుకొని నిర్వహించే తిరునాళ్ల మహోత్సవానికి కోటప్పకొండ సర్వాంగసుందరంగా ముస్తాబయింది. తెలుగు రాష్ట్రాలతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తిరునాళ్ల జాగరణకు తరలివస్తారు. యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వ శాఖలు విస్తృత ఏర్పాట్లు చేశాయి. త్రికోటేశ్వర స్వామి ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పూలతో అలంకరించారు. స్వామివారికి రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ప్రభుత్వ శాఖలు విస్తృత ఏర్పాట్లు చేశాయి. ప్రభల తిరునాళ్లగా పిలవబడే కోటప్ప కొండ తిరునాళ్లకు ఈ దఫా 18 ప్రభలు రానున్నాయి.

అడ్డరోడ్డులో అన్ని ఏర్పాట్లు

చిలకలూరిపేట: స్థానికులతో పాటు సుదూర ప్రాంతాల నుంచి కోటప్పకొండ తిరునాళ్లకు వెళ్లే ప్రయాణికులు అత్యధికంగా చిలకలూరిపేట మీదుగానే వెళతారు. పట్టణంలోని పురుషోత్తమపట్నం అడ్డరోడ్డు సెంటర్‌లో ఇప్పటికే ఆర్టీసీ తాత్కాలిక బస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. మంగళవారం సాయంత్రం నుంచి 105 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డీఎం ఎస్.రాంబాబు తెలిపారు. చలివేంద్రాలు, అల్పాహార కేంద్రాలు ఏర్పాటు చేశారు. స్థానికంగా చౌత్రసెంటర్‌లోని గంగాపార్వతి సమేత ఉమామహేశ్వరస్వామి ఆలయంలో, కళామందిర్ సెంటర్‌లోని శివాలయంలో శివరాత్రిని పురస్కరించుకొని బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

తరలి వెళ్లిన ప్రభలు...

భక్తిశ్రద్ధలతో ప్రభలు కట్టి కోటయ్యస్వామిని దర్శించేందుకు భక్తులు తరలివెళ్లారు. భారీ విద్యుత్ ప్రభలు కట్టి కోటప్ప కొండకు పయనమయ్యారు. తిరునాళ్లకు ప్రభలను నిర్మించటం మనదైన సంప్రదాయం. పట్టణ పరిధిలోని పురుషోత్తమపట్నం నుంచి ఏకంగా 10 ప్రభలు కట్టారు. ఇందులో ఆరు భారీ విద్యుత్ ప్రభలు. ప్రభల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్న అనంతరం కొండ జాతరకు తరలారు. ఈ పూజల్లో మాజీ మంత్రి విడదల రజిని పాల్గొనటంతో పాటు ప్రభకు ఏర్పాటు చేసిన ట్రాక్టర్‌ను నడిపి సందడి చేశారు.

కొండకు చేరిన గ్రామ ప్రభలు

నరసరావుపేట రూరల్, నాదెండ్ల: కోటప్పకొండ తిరునాళ్లకు మండలంలోని ఉప్పలపాడు, గురవాయపాలెం గ్రామాల నుంచి భారీ విద్యుత్ ప్రభలు కొండకు తరలివెళ్లాయి. ప్రభ వెంట మహిళలు, యువకులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అదేవిధంగా నాదెండ్ల మండలం అప్పాపురం, అమీన్‌సాహెబ్‌పాలెం గ్రామ ప్రభలకు మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామం చివరి వరకూ సాగనంపారు.


గురవాయపాలెంలో హైటెన్షన్ వైర్ల వద్ద ఉప్పలపాడు ప్రభను కిందకు వంచి తీసుకువెళ్తున్న దృశ్యం

వైభవం.. బ్రహ్మోత్సవం


పెదకాకాని: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పెదకాకాని భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో మూడవరోజు మంగళవారం భ్రమరాంబ అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవిగా భక్తులను అనుగ్రహించారు. మయూర వాహనంపై స్వామివారి గ్రామోత్సవం, పంచహారతులు నిర్వహించారు. ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు.

నేడు కల్యాణం..

బుధవారం అమ్మవారు స్వర్ణకవచాలంకృత భ్రమరాంబగా భక్తులను అనుగ్రహిస్తారు. శివరాత్రి పురస్కరించుకుని రాత్రి 11 గంటలకు లింగోద్భవకాలంలో స్వామివారికి ఏకాదశ ద్రవ్యాలతో రుద్రాభిషేకం, 12 గంటలకు రావణబ్రహ్మ వాహనంపై ఎదుర్కోలు ఉత్సవం, తెల్లవారుజామున 2 గంటలకు స్వామి వారి కల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిపించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఆలయ డీసీ జి. లీలాకుమార్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.


విద్యుద్దీపకాంతుల్లో వెలిగిపోతున్న శివాలయం

ప్రభవించిన హరనామం!


అప్పాపురం నుంచి తరలి వెళ్తున్న భారీ గ్రామప్రభ

అక్రమాలకు కేరాఫ్ ఆలపాటి

- అధికారాన్ని అడ్డుపెట్టుకొని అరాచకాలు
- తాడేపల్లి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు అన్యాయం
- సొంత సామాజిక వర్గాన్నీ వదలని వైనం
- తమ భూమిలో అక్రమంగా ఫ్యాక్టరీ పెట్టారని రాయపాటి రాజ్యలక్ష్మి న్యాయ పోరాటం
- తాజా ఎమ్మెల్సీ ఎన్నికల్లో పెద్దఎత్తున హైదరాబాద్, చెన్నై, బెంగళూరుకు చెందిన ఐటీ ఉద్యోగుల ఓట్లు చేర్చిన వైనం
- వారిని రప్పించడానికి ఓటుకు రూ. 10 వేలు ఖర్చు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: అధికారాన్ని అడ్డం పెట్టుకుని తెలుగుదేశం పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజా చేసిన అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. బాధితులు ముందుకు వచ్చి తమకు జరిగిన అన్యాయాన్ని వెళ్లబోసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆయన దళితులనే కాకుండా సొంత సామాజికవర్గం నేతలను కూడా వదలలేదని చెబుతున్నారు.

- తమ భూమిని తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజా ఆక్రమించారని గుంటూరు చంద్రమౌళీ నగర్‌కు చెందిన రాయపాటి రాజ్యలక్ష్మి భర్త గుళ్లపల్లి సుబ్బారావు ఆరోపిస్తున్నారు. తన భార్య పేరిట ఉన్న ఆస్తిని ఆక్రమించుకుని అందులో ఎన్ఆర్ఐ అగ్రిటెక్ అనే సంస్థను నడుపుతున్నారని, దీని కోసం గత 15 ఏళ్లుగా పోరాడుతున్నట్లు ఆయన చెబుతున్నారు.
- విజయవాడ నగరంలోని శాతవాహన కళాశాల వివాదంలో కూడా ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాత్ర ఉంది. నగరం నడిబొడ్డున రూ.వందల కోట్లు విలువ చేసే 5.10 ఎకరాల వివాదంలో అప్పట్లో మంత్రిగా ఉన్న ఆలపాటి రాజా జోక్యం చేసుకున్నారు. ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ కళాశాలను తన గుప్పెట్లో ఉంచుకోగా.. గతంలో సెక్రటరీగా పని చేసిన జి.ప్రజాపతిరావు కళాశాల తనదేనంటూ రాజేంద్రప్రసాద్‌తో విభేదించారు. చివరకు ఈ విషయం హైకోర్టు, సుప్రీంకోర్టు వరకు వెళ్లింది.



విజయవాడ విశాలాంధ్ర రోడ్డులోని శాతవాహన కాలేజీ గ్రౌండ్

- ఈనామ్ భూములను వారసత్వం పేరుతో వీలు నామాలు సృష్టించి 46.82 ఎకరాల భూమిని ఆక్రమించినందున ఆలపాటి రాజా నామినేషన్‌ను జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి తక్షణమే రద్దు చేయాలని దళిత సంఘ నాయకుడు పిల్లి బాబురావు గతవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.
- తాడేపల్లిలో 31 ఏళ్ల క్రితం మూతపడిన సిమెంట్ కంపెనీ కార్మికులకు రావాల్సిన నష్టపరిహారం కోసం కార్మికులు ఆందోళన ఉధృతం చేశారు. తమకు న్యాయం చేయని పక్షంలో ఆమరణ దీక్షకు సిద్ధమని కార్మికులు ప్రకటించారు. గత వంద రోజులుగా ఆందోళన చేస్తున్నారు. ఈ వ్యవహారంలో కూడా ఆలపాటి రాజా హస్తం ఉండటం గమనార్హం. ఈ భూములను కోల్‌కత కోర్టులో వేలం వేస్తే ప్రస్తుత మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరితో పాటు మరికొందరు కలిసి ఈ భూమిని కొన్నారు. తర్వాత దీన్ని ఎన్ఆర్ఐ అకాడమీకి అమ్మినట్లు చూపించారు. ఆ సమయంలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ జోక్యం చేసుకుని ఫ్యాక్టరీని పూర్తిగా తొలగించి, స్థలాన్ని చదును చేయించారు. కార్మికులపై బెదిరింపులకు దిగారు. 2015లో కార్మికులకు అనుకూలంగా కోర్టు తీర్పు వచ్చింది. సెంట్రల్ లేబర్ కోర్టు, హైకోర్టులు ఏసీసీ కార్మికులకు రూ.43 కోట్లు ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చాయి. ఈ ఆదేశాలను అమలు చేసే నాథుడు లేకుండా పోయాడు. ఈ అంశంపై మంత్రి లోకేష్ న్యాయం చేస్తానని ఎన్నికల ముందు ప్రకటించినా తర్వాత దాని ఊసు పట్టించుకోవడం లేదని కార్మికులు ఆరోపిస్తున్నారు.

గెలిచేందుకు అడ్డదారులు

ఇన్ని అక్రమాలు చేసిన ఆలపాటి రాజా ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు కోసం కూడా అడ్డదారులు తొక్కుతున్నారు. ఎన్నికల ముందు వ్యూహాత్మకంగా బెంగళూరు, హైదరాబాద్, చెన్నై వంటి నగరాల్లో పనిచేస్తున్న వారి వివరాలు తీసుకుని వారి ఓట్లు చేర్పించారు. వారంతా ఎప్పుడో ఇక్కడి నుంచి వెళ్లిపోయి బయట ఉద్యోగ రీత్యా స్థిరపడిపోయినా వారందరి ఓట్లు చేర్పించి వారి ఓట్లతో గెలవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. వారిని అక్కడి నుంచి రప్పించి ఓట్లు వేయించేందుకు ఒక్కొక్కరికి రూ.10వేల వరకూ ఖర్చు చేయడానికి సిద్ధపడినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నారు.

ముక్తిని ప్రసాదించే
ముక్తేశ్వరుడు


మోర్తోటలోని ముక్తేశ్వరస్వామి దేవాలయం


మోర్తోట ముక్తేశ్వరస్వామి

రేపల్లె రూరల్: మహాశివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని మోర్తోట గ్రామంలో వేంచేసియున్న ముక్తేశ్వరస్వామి ఆలయాన్ని సర్వం సిద్ధం చేశారు. కృష్ణానది తీరంలో దక్షిణ కాశీగా పేరుగాంచిన ముక్తేశ్వరుని కొలిస్తే ముక్తిని ప్రసాదిస్తాడని భక్తుల ప్రగాఢ విశ్వాసం. దీంతో మహాశివరాత్రి పర్వదినాన్ని కృష్ణానదిలో పుణ్యస్నానమాచరించి స్వామివారిని కొలుస్తారు. వందల సంవత్సరాల చరిత్ర కలిగిన మోర్తోట గ్రామంలో శివరాత్రి వేడుకలను తిలకించేందుకు సమీపంలోని కృష్ణా, ప్రకాశం జిల్లాల నుంచి ఇక్కడికి వచ్చి మొక్కుబడులు చెల్లించుకుంటారు. ఆలయంలో వేడుకల్లో భాగంగా బుధవారం తెల్లవారుజాము 3 గంటల నుంచి స్వామివారికి అభిషేకాలు, సాయంత్రం 6 గంటలకు జగాజ్యోతి, రాత్రి 7.30గంటలకు స్వామివారి కల్యాణం, గురువారం స్వామివారి తిరునాళ్ల, గ్రామోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ప్రశాంత వాతావరణంలో ఎమ్మెల్సీ ఎన్నికలు

ఎన్నికల సాధారణ పరిశీలకులు వి.కరుణ

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల ఓటింగ్ పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా అవసరమైన చర్యలు పటిష్టంగా చేపట్టాలని ఉమ్మడి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల సాధారణ పరిశీలకులు వి.కరుణ ఉమ్మడి కృష్ణా, గుంటూరు పరిధిలోని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి ఎన్నికల ఓటింగ్‌పై గుంటూరు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జేసీ ఎ.భార్గవతేజతో కలిసి ఎన్టీఆర్, కృష్ణా, పల్నాడు, బాపట్ల, ఏలూరు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. అబ్జర్వర్ వి.కరుణ మాట్లాడుతూ గురువారం శాసనమండలి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్‌కు అవసరమైన అన్ని చర్యలు పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా ఎస్పీలు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల వరకు 144 సెక్షన్‌ను విధించాలన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న అబ్జర్వర్ వి.కరుణ, చిత్రంలో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జేసీ భార్గవ తేజ

ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

లక్ష్మీపురం: ఉమ్మడి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికలు పారదర్శకంగా, సజావుగా, ప్రశాంతంగా జరిగేలా పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని డీఆర్సీ హాలులో డీఆర్ఓ ఖాజావలితో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలకు ఫిబ్రవరి 27న గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకు ఓటింగ్ జరుగుతుందన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన 10 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి కేంద్రానికి తీసుకెళ్లాల్సి ఉంటుందన్నారు. ఈ ఎన్నికల్లో 25 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని, బ్యాలెట్ పేపర్లో వారి సీరియల్ నెంబరు, పేరు, ఫొటో, ఏ పార్టీ తరఫున పోటీ చేస్తున్నారనే వివరాలతో కూడిన పోస్టర్‌ను పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేశామన్నారు. ఓటర్లను ప్రలోభపెట్టడం, వారిని బెదిరించటం వంటివి చేస్తే కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాల్సిందిగా కోరారు. జిల్లాలో 3,47,116 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారన్నారు. శాసనమండలి ఎన్నికలు జరిగే 483 పోలింగ్ కేంద్రాలలో పూర్తి స్థాయిలో మౌలిక సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. జిల్లా ఎస్పీ, పోలీస్ శాఖల సమన్వయంతో పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బ్యాలెట్ పేపర్ల కౌంటింగ్ జిల్లాలోని ఏసీ కళాశాలలో నిర్వహిస్తున్నందున అన్ని జిల్లాల్లో రిసెప్షన్ కేంద్రాల నుంచి బ్యాలెట్ బాక్సులు ఏసీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూముకు తీసుకువచ్చి అభ్యర్థుల సమక్షంలో స్ట్రాంగ్ రూములో భద్రపరిచి సీల్ వేయడం జరుగుతుందన్నారు.

- ఉమ్మడి కృష్ణా – గుంటూరు పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గానికి జరిగే ఎన్నికలకు సంబంధించి స్థానిక ఏసీ కళాశాలలో రిసెప్షన్ సెంటర్లు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, కౌంటింగ్ సెంటర్ ఏర్పాట్లను మంగళవారం జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, జేసీ భార్గవ్ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహాలతో కలసి పరిశీలించారు.



వాణిజ్యం

నిమ్మకాయల ధరలు



గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **5,000** గరిష్ఠం : రూ. **6,100**

మోడల్ ధర రూ. **5600**

క్లుప్తంగా

యార్డులో 1,26,285 బస్తాల మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 1,19,894 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,26,285 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,000 నుంచి రూ.14,300 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.14,200 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.7,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 63,478 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

పసుపు ధరలు



దుగ్గిరాల: స్థానిక పసుపు యార్డులో గరిష్ఠ ధర రూ.10,800 మంగళవారం పలికినట్లు వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. యార్డుకు 488 బస్తాలు వచ్చాయి. సరుకు కనిష్ఠ ధర రూ.9,500 గరిష్ఠ ధర రూ.10,800 మోడల్ ధర రూ.10,800, కాయలు కనిష్ఠ ధర రూ.9,700, గరిష్ఠ ధర రూ.10,800, మోడల్ ధర రూ.10,800, మొత్తం 366 క్వింటాళ్ల అమ్మకాలు జరిగినట్లు చెప్పారు.

విద్యార్థులతో అసభ్య ప్రవర్తనపై ఆందోళన

తెనాలిరూరల్: ప్రైవేటు కళాశాల ఫ్లోర్ ఇన్‌చార్జి విద్యార్థులతో అసభ్యంగా ప్రవర్తించాడంటూ కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. పట్టణ గంగానమ్మపేటలోని ఎన్‌ఆర్‌ఐ జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్న విద్యార్థులను కళాశాల ఫ్లోర్ ఇన్‌చార్జి శ్రీకాంత్ సోమవారం అసభ్య పదజాలంతో దూషించాడు. ఈ మేరకు విద్యార్థులు, తల్లిదండ్రులకు చెప్పడంతో మంగళవారం కళాశాలకు వచ్చి అతడిని నిలదీశారు. తాను విద్యార్థులను దూషించలేదని శ్రీకాంత్ వివరణ ఇచ్చాడు. కళాశాలలో అటువంటి ఘటనలకు అవకాశమే లేదని యాజమాన్యం హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఉచితం... ఉత్తిత్తేనా..!



- అమలుకు నోచని ఉచిత బస్సు ప్రయాణం
- తొమ్మిది నెలలు గడుస్తున్నా... మహిళల ప్రయాణానికి దిక్కులేదు
- ఓట్లేసి మోసపోయామంటున్న మహిళలు

పట్నంబజారు: ఎన్నికల్లో హామీల వర్షం గుప్పించారు. మహిళలకు అడ్డగోలుగా ఉచిత పథకాలు ప్రకటించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ప్రధానమైనది ఉచిత బస్సు. అధికారంలోకి వచ్చిన పిమ్మట అదిగో ఆగస్టు.. ఇదిగో దసరా.. వచ్చే సంక్రాంతి.. ఇలా పండగల సమయానికి అమలు అంటూ ప్రకటనలు చేశారు. ప్రభుత్వం ఏర్పాటై తొమ్మిది నెలలు గడుస్తున్నా హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం హామీపై తొలుత గత ఏడాది ఆగస్టు 15కు ఉచిత బస్సు ప్రక్రియ అని చెప్పి తుస్సుమనిపించారు. ఆ తరువాత దసరా ధమాకా ధమాల్ అంది.. దీపావళి ఇస్తామని చెప్పిన పరిస్థితుల్లో.. బస్సు వెలుగులు కనపడలేదు.. సంక్రాంతికి ఇక సరేసరి. త్వరలోనే ఉచిత బస్సు ప్రయాణం అంటూ రాష్ట్ర రోడ్డు రవాణ శాఖ మంత్రి ప్రకటించగా.. ఇంకో అమాత్యుడు నారా లోకేష్ రోడ్ మ్యాప్ వేద్దాం.. వచ్చే ఏడాది నుంచి పథకాల అమలుపై దృష్టి సారిద్దామని చెబుతున్నారు. హామీలు చూస్తుంటే భయమేస్తుందని ఏకంగా సీఎం చంద్రబాబు చెప్పడంపై అన్ని వర్గాల ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక ఉచిత ప్రయాణం లేనట్టేనా? అని మహిళలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్టీసీ ప్రయాణం ఇలా...

గుంటూరు జిల్లాకు సంబంధించి నిత్యం లక్ష మంది ప్రయాణికులు ఆర్టీసీలో ప్రయాణం చేస్తున్నారని గణాంకాలు చెబుతున్నాయి. అందులో 60 శాతం మంది మహిళలే ఉన్నారు. గుంటూరు కేంద్రంగా నిత్యం అనేక ప్రాంతాలకు మహిళా ఉద్యోగులు, ఆయా పనులు చేసుకునే వారు, వ్యాపారం చేసే మహిళలు నిత్యం ప్రయాణంతో పాటు, విద్యార్థులు, ఉద్యోగాలు చేసుకునే యువత కూడా అధికంగానే ఉన్నారు.

జిల్లా వ్యాప్తంగా మహిళల ప్రయాణం..

గుంటూరు తూర్పు నియోజకవర్గానికి సంబంధించి మహిళలు 1.50 లక్షలు, పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించి లక్ష 30 వేలు, తెనాలి 1.41 లక్షలు, పొన్నూరు లక్ష 15వేలు, తాడికొండ లక్ష 60 వేలు, మంగళగిరి 2 లక్షల 3 వేలు, ప్రత్తిపాడులో లక్ష 45 వేలకు మందికి పైగా ఉన్నారని గణంకాలు చెబుతున్నాయి. జిల్లాలో గుంటూరు 1, 2 డిపోలు, తెనాలి, పొన్నూరు, మంగళగిరి డిపోలు ఉండగా, రీజియన్ పరిధిలో 345 బస్సులు ఉన్నాయి. అధికంగా మహిళలు గుంటూరు 1, 2 డిపోలు, మంగళగిరి ప్రాంతాల నుంచి హైకోర్టు, సచివాలయం, ఇతరత్రా ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేట్ ఉద్యోగాల వారు నెలవారీ పాస్‌లు తీసుకుని ప్రయాణిస్తున్నారని తెలుస్తోంది. ఇప్పటికైనా మార్గదర్శకాలు జారీ చేసి.. మహిళలకు ఉచిత ప్రయాణాన్ని అందించాలని కోరుతున్నారు.

కేఎస్ లక్ష్మణరావును గెలిపించాలి

పీడీఎఫ్ మాజీ ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రహ్మణ్యం



మాట్లాడుతున్న విఠపు బాలసుబ్రమణ్యం

గుంటూరు ఎడ్యుకేషన్: నిజాయతీ, నిబద్ధత కలిగిన కేఎస్ లక్ష్మణరావుకు అండగా నిలిచి అఖండ మెజార్టీతో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా గెలిపించాలని పీడీఎఫ్ మాజీ ఫ్లోర్‌లీడర్ విఠపు బాలసుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం జిల్లా కోర్టుతో పాటు వివిధ ఇంజినీరింగ్ కళాశాలల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేఎస్ లక్ష్మణరావు 14 ఏళ్లుగా ఎమ్మెల్సీగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పని చేశారని, ఎటువంటి అవినీతి మరకలు లేకుండా నిజాయతీగా ప్రజల పక్షాన పోరాటాలు నిర్వహించారని చెప్పారు. శాసనమండలిలో ప్రజా గళం వినిపించడం కోసం పీడీఎఫ్ అభ్యర్థులు అవసరమని, శాసనమండలి ఏర్పడినప్పటి నుంచి పీడీఎఫ్ అటువంటి పాత్ర నిర్వహిస్తోందన్నారు. సోషల్ మీడియాలో వివిధ రకాల తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, నిజాయితీగా ఎదుర్కొనే ధైర్యం లేక ఇటువంటి రాజకీయాలు చేయడం సరికాదన్నారు. ఈనెల 27న జరగనున్న గ్రాడ్యుయేట్ ఎన్నికలను ప్రభుత్వం సజావుగా జరిగే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ప్రముఖ రచయిత, న్యాయవాది పెనుగొండ లక్ష్మీనారాయణ, టీఆర్ రమేష్, జాషువా, బి.లక్ష్మణరావు, బాషా, రమేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తల్లీకుమార్తె మృతి



నాగమణి, శరణ్య(ఫైల్)

గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో తల్లికూతురు మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. నల్లపాడు పోలీసులు తెలిపిన వివరాలు.. అడవితక్కెళ్లపాడులోని రాజీవ్‌గృహకల్పకు చెందిన విజమూరి నాగమణి(45), కుమార్తె శరణ్య(14) రాజీవ్‌గాంధీ కాలనీలోని తమ బంధువులకు పూలు ఇచ్చేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఘటన చోటుచేసుకుంది. అమరావతి రోడ్డులోని చిల్లీస్ సెంటర్ వద్ద లాడ్జి సెంటర్ నుంచి అమరావతి వెళ్తున్న లారీ మితిమీరిన వేగంతో వచ్చి ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీకొంది. ప్రమాదంలో ఘటన స్థలంలోనే ఇద్దరూ మృతి చెందారు. నాగమణి భర్త పుల్లయ్య 2014లో అనారోగ్యంతో మృతి చెందటంతో టైలరింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటుంది. ఆమెకు ఒక కుమారుడు గోపిచంద్, కుమార్తె శరణ్య(14) ఉన్నారు. గోపిచంద్ బీటెక్ పూర్తి చేసి విజయవాడలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. శరణ్య స్థానికంగా 9వ తరగతి చదువుతోంది. ఘటనా స్థలాన్ని నల్లపాడు పోలీస్ స్టేషన్ సీఐ వంశీధర్, ఎస్ఐ నాగరాజు పరిశీలించారు. మృతదేహాలను జీజీహెచ్ మార్చురీకి తరలించి పోస్టుమార్టం నిర్వహించి మృతుడి బంధువులకు అప్పగించారు. ఘటనపై మృతురాలి కొడుకు గోపిచంద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు వేమవరంలో ఉచిత కుంభమేళ సాహి స్నానం

నగరంపాలెం: మహా శివరాత్రి సందర్భంగా ఫిరంగిపురం మండలం వేమవరంలోని కోటి లింగాల దేవాలయంలో ఉచిత కుంభమేళ సాహి స్నానం నిర్వహించనున్నట్లు కమిటీ నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోజంతా నర్మద బాణలింగాలకు అభిషేకం, లింగోద్భవ కాలంలో మరకత శివలింగానికి అభిషేకం చేసుకునేలా కుంభమేళా నుంచి తీసుకొచ్చిన జలంతో పవిత్ర సాహి స్నానం చేసుకునేలా ఏర్పాట్లు చేశామని వివరించారు.

ఘనంగా శ్రేష్ఠ హాస్పిటల్ వార్షికోత్సవం



గుంటూరు మెడికల్: గుంటూరు శ్రేష్ఠ హాస్పిటల్స్‌లో అమెరికా, లండన్ లాంటి నగరాల్లోని హాస్పిటల్స్‌లో మాదిరిగా అత్యాధునిక వైద్య సౌకర్యాలు, వైద్య చికిత్సలు ఉన్నాయని డాక్టర్ కొల్లి శారద అన్నారు. మంగళవారం గుంటూరు గుజ్జనగుండ్ల సెంటర్‌లోని శ్రేష్ఠ హాస్పిటల్స్ ప్రథమ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ కొల్లి శారద మాట్లాడుతూ రోగులకు శ్రేష్ఠ హాస్పిటల్ కంటే బెస్ట్ ట్రీట్మెంట్, బెస్ట్ కేరింగ్ ఎవ్వరూ ఇవ్వలేరని చెప్పారు. రాబోయే రోజుల్లో శ్రేష్ఠ హాస్పిటల్స్ మరిన్ని శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. శ్రేష్ఠ హాస్పిటల్స్ లో చికిత్స పొందిన పి.రామ చంద్ర రాజు మాట్లాడుతూ ఎంతో క్లిష్ట పరిస్థితుల్లో హెర్నియా ఆపరేషన్ కోసం శ్రేష్ఠ హాస్పిటల్స్‌కి వచ్చానని, క్లిష్ట పరిస్థితిలో ఆస్పత్రికి రావడం జరిగిందన్నారు. అధునాతన చికిత్సతో త్వరగా నయం అయిపోయిందని ఆనందం వ్యక్తం చేశారు. శ్రేష్ఠ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ లక్ష్మణస్వామి, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నాగార్జున గొట్టిపాటి, హాస్పిటల్ స్టాఫ్‌కి బెస్ట్ ఎంప్లాయీస్ అవార్డు అందించి వారు చేసిన సేవలకు కృతజ్ఞతలు తెలిపారు.

పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావు గెలుపునకు కృషి

వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: కృష్ణా– గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో పీడీఎఫ్ అభ్యర్థి కె.ఎస్.లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్య ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. లక్ష్మణరావు మంచి విద్యావేత్తని, పట్టభద్రులు, నిరుద్యోగులు సమస్యల కోసం నిత్యం పోరాడుతూ ఉంటారని, ఆయన గెలుపు నిరుద్యోగుల జీవితాలకు వెలుగునిస్తుందని అన్నారు. లక్ష్మణరావు గెలుపును మన బాధ్యతగా తీసుకొని నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని కోరారు.

డ్రైవర్లకు శిక్షణ

పట్నంబజారు: ఏపీఎస్‌ఆర్టీసీ గుంటూరు రీజియన్ పరిధిలో లైట్ మోటారు వెహికల్ లైసెన్సు(కారు, జీపు) డ్రైవర్లకు హెవీ మోటారు వెహికల్ డ్రైవింగ్ ట్రైనింగ్ స్కూల్ ప్రారంభించినట్లు ఆర్టీసీ ఆర్‌ఎం ఎం.రవికాంత్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 19వ బ్యాచ్ అడ్మిషన్లు ప్రారంభించినట్లు వివరించారు. అడ్మిషన్లు ప్రారంభమైన నేపథ్యంలో శిక్షణ పొందేందుకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఒక్కో బ్యాచ్‌కు 16 మంది మాత్రమే అవకాశం ఉన్న నేపథ్యంలో త్వరితగతిన దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 8897371003 నంబరులో సంప్రదించాలని కోరారు.

మద్యం దుకాణాలు బంద్

నెహ్రూ నగర్: కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక ఈనెల 27వ తేదీన నిర్వహించనున్న నేపథ్యంలో జిల్లాలోని మద్యం దుకాణాలు, రెస్టారెంట్లు పూర్తిగా మూతపడుతున్నట్లు ఎక్సైజ్ శాఖ డెప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 25 సాయంత్రం నుంచి 27 తేదీ మద్యం విక్రయాలు ఉండవన్నారు. తిరిగి 28వ తేదీ మద్యం దుకాణాలు తెరుచుకుంటాయన్నారు. అదేవిధంగా మార్చి మూడో తేదీ కౌంటింగ్ సందర్భంగా ఆరోజు కూడా మద్యం దుకాణాలు మూసి ఉంటాయని చెప్పారు.

రైల్వే సరుకు రవాణాలో అగ్రస్థానం

డీఆర్ఎం రామకృష్ణ

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే గుంటూరు డివిజన్ పరిధిలోని సరుకు రవాణాలో రెండో సారి ఈ ఏడాది గడువు తేదీ కంటే ముందే మూడు టన్నుల సరుకు లోడింగ్ సాధించి మరో సారి డివిజన్ తన నైపుణ్యాన్ని సాధించిందని డివిజన్ డీఆర్ఎం రామకృష్ణ అన్నారు. పట్టాభిపురంలోని డీఆర్ఎం కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ గత ఏడాది కంటే వారం ముందుగానే అంతకు ముందు ఆర్థిక సంవత్సరంలో మార్చి 2వ తేదీ కంటే ముందరే సరుకు రవాణాలో ముందంజలో ఉన్నామని చెప్పారు. రెండు సార్లు ఈ ఘనతను సాధించడం చాలా సంతోషదాయకంగా ఉందని పేర్కొన్నారు. దీన్ని సాధ్యం చేయడంతో బ్రాంచ్ అధికారులు తిరుగులేని మద్దతు, ప్రణాళిక, అంకితభావం, టీమ్ వర్క్‌ల ఫలితమే ఈ విజయానికి కారణం అన్నారు. సీనియర్ డీఓఎం ఎం.దినేష్‌కుమార్, సీనియర్ డీసీఎం సిహెచ్ ప్రదీప్‌కుమార్‌లను ప్రత్యేకంగా అభినందించారు. గత ఏడాదితో పోలిస్తే డివిజన్ వేగంగా 20 శాతం సరుకు రవాణా సాధించిందన్నారు. రోలింగ్ బ్లాక్ కారిడార్ ప్రోగ్రామ్‌లో 95.91 బ్లాక్ మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఇప్పటి వరకు డివిజన్‌లోని మొత్తం 100 లాంగ్ హాల్స్ ఏర్పడ్డాయన్నారు. ఈ ఏడాదిలో 88.95 శాతం సమయపాలన సాధించిందని వివరించారు. సీనియర్ డీఓఎం దినేష్ కుమార్ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా గుంటూరు డివిజన్ డీఆర్ఎం ఎం.రామకృష్ణ నేతృత్వంలో ఏ డివిజన్‌లో లేని విధంగా సరుకు రవాణా రెండు సార్లు 3 మిలియన్ల టన్నులు సాధించడం జరిగిందన్నారు. డీఆర్ఎం రామకృష్ణ ఆధ్వర్యంలో గుంటూరు డివిజన్‌లో సరుకు రవాణా గత ఆర్థిక సంవత్సరానికి ముందుగానే విజయం సాధించడం చాలా ఆనందదాయకంగా ఉందని వెల్లడించారు.

కేఎల్‌యూకు గ్రీన్ ఉర్జా, ఎనర్జీ ఎఫిషియెన్సీ అవార్డు

తాడేపల్లిరూరల్: రూరల్‌పరిధిలోని వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీకి ప్రతిష్టాత్మకమైన గ్రీన్ ఉర్జా, ఎనర్జీ ఎఫిషియెన్సీ– 2024 అవార్డు సాధించినట్లు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెలాయిట్ నాలెడ్జ్ పార్టనర్‌గా కోల్‌కత్తాలోని ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ నిర్వహించిన 5వ ఉర్జా, ఎనర్జీ ఎఫిషియెన్సీ అవార్డులో తమ వర్సిటీని ఎనర్జీ ట్రాన్సిషన్ ఎక్సలెన్స్ అవార్డు – మ అకాడెమియాతో సత్కరించిందని తెలిపారు. వంద శాతం క్యాంపస్ ప్లేస్‌మెంట్ కోసం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని వివరించారు.

కె.ఎస్.లక్ష్మణరావుపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారంపై కేసు

లక్ష్మీపురం: సోషల్ మీడియాలో ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కె.ఎస్.లక్ష్మణరావుపై తప్పుడు ప్రచారం చేసిన వారిపై మంగళవారం కేసు నమోదు చేశారు. అరండల్‌పేట పోలీసులు పోలీసులు తెలిపిన వివరాలు.. బ్రాడీపేటకు చెందిన ప్రస్తుత ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పట్టభద్రుల స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అసత్యప్రచారం చేస్తుండడంతో ఆయన తరపున ఎన్నికల ఏజెంట్ రమేష్ బాబు అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు సోషల్ మీడియా, యూ ట్యూబ్‌లో పరిశీలించగా తప్పుడు ప్రచారం చేసిన వారిలో కె.సత్యనారాయణ, పిల్లి కోటి, జెట్టి రేణుక, మరికొందరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, కె.ఎస్.లక్ష్మణరావుపై సోషల్ మీడియా తప్పుడు ప్రచారంపై వచ్చిన ఫిర్యాదుపై జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

తులసి సీడ్స్ ఆధ్వర్యంలో పోలీసులకు భోజన వసతి



భోజన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న తులసి సీడ్స్ చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు

కొరిటిపాడు(గుంటూరు): మహా శివరాత్రి సందర్భంగా కోటప్పకొండలో సేవా శిబిరానికి విచ్చేసిన 3,000 మంది పోలీస్ సిబ్బంది, 300 మంది స్కౌట్స్ అండ్ గైడ్స్ సిబ్బందికి తులసి సీడ్స్ చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు అల్పాహారం, భోజన వసతి ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని మంగళవారం తులసి సీడ్స్ చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు, అరుణ దంపతులు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా తులసి రామచంద్ర ప్రభు మాట్లాడుతూ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ చేసే సేవా కార్యక్రమాలు వారిలో దేశభక్తిని, సేవాతత్పరతను పెంపొందిస్తాయని అన్నారు. దేశాభివృద్ధికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. గత 14 సంవత్సరాలుగా, భక్తుల సేవ, సహాయ కార్యక్రమాల నిమిత్తం కోటప్పకొండ తిరునాళ్లకు విచ్చేస్తున్న పోలీస్ సిబ్బందికి మూడు రోజుల పాటు భోజన వసతి కల్పిస్తున్నట్లు వివరించారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులను ఉద్దేశించి తులసి సీడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ యోగేష్ చంద్ర మాట్లాడుతూ విద్యార్థులందరూ గొప్ప గొప్ప లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని పట్టుదలతో వాటిని సాధించి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులకు యోగేష్ చంద్ర మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో క్యాంపు కన్వీనర్ రాంబాబు, క్యాంపు ఆఫీసరు టి.శ్రీనివాసరావు, క్యాంపు సహాయకులు వి.వి.హరనాథ్, షేక్ దావూద్, ఎస్.అంజి రెడ్డి పాల్గొన్నారు.

క్రీడలకూ ఉద్యోగులు ప్రాధాన్యం ఇవ్వాలి

సెంట్రల్ ట్యాక్స్, కస్టమ్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి



క్రీడా పోటీల్లో గెలుపొందిన వారిని అభినందిస్తున్న కమిషనర్ సాధు నరసింహారెడ్డి

లక్ష్మీపురం(గుంటూరు): విధి నిర్వహణలో అవిశ్రాంతంగా పనిచేసే ఉద్యోగులకు క్రీడలు మేధాశక్తిని, సామర్థ్యాన్ని మరింత పెంచుతాయని కస్టమ్స్, సెంట్రల్ ట్యాక్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి అన్నారు. బెంగళూరులో ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించిన అఖిల భారత రెవెన్యూ స్పోర్ట్స్ మీట్‌లో స్వర్ణ, రజిత పతకాలు సాధించి, గుంటూరుకు తిరిగి వచ్చిన క్రీడా ఉద్యోగులు పి.వెంకటాచలం, పి.వెంకటేశ్వర్లుకు మంగళవారం కన్నవారితోటలోని జి.ఎస్.టి.భవన్‌లో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు తమకు నచ్చిన క్రీడలలో పాల్గొని మరింత క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలని కోరారు. తమ శాఖకు చెందిన సూపరింటెండెంట్ పి.వెంకటాచలం లాన్ టెన్నిస్ 50 ప్లస్ డబుల్స్‌లో స్వర్ణ పతకం, 40 ప్లస్ సింగిల్స్, డబుల్స్‌లో రెండు రజిత పతకాలు, ట్యాక్స్ అసిస్టెంట్ పి.వెంకటేశ్వర్లు 100 మీటర్ల పరుగు పందెంలో రజిత పతకం గెలుచుకొని జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చారని కొనియాడారు. అనంతరం విజేతలను పట్టు శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్లు ఎం.నాగరాజు, బి.ఆనందరావు, సూపరింటెండెంట్లు గాదె శ్రీనివాసరెడ్డి, చిదేళ్ళ ఈశ్వరరావు, పూర్ణ సాయి, కాకర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముగిసిన బాల బాలికల జిల్లా స్థాయి ఫెన్సింగ్ పోటీలు



ఫెన్సింగ్ పోటీలో గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు, మెడల్స్‌ను బహూకరిస్తున్న దృశ్యం

లక్ష్మీపురం: స్థానిక పాత్తూరులోని యాక్ మీ స్కూల్‌లో గుంటూరు ఫెన్సింగ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్– 14 సబ్ జూనియర్ బాల బాలికల జిల్లా స్థాయి ఫెన్సింగ్ పోటీలు మంగళవారం ముగిశాయి. యాక్ట్ మీ స్కూల్ డైరెక్టర్ దీప్తి నందమూరి మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడల్లో కూడా ప్రాధాన్యత ఇచ్చేలా విద్యార్థుల తల్లి దండ్రులు ప్రోత్సహించాలని కోరారు. అసోసియేషన్ జనరల్ సెక్రటరీ డి.అశోక్ బాబు మాట్లాడుతూ ఈ జిల్లా స్థాయిలో గెలుపొందిన వారు మార్చి ఒకటో తేదీన కంచికచర్ల ఏకత్వ స్కూల్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. పోటీలకు ఉమ్మడి జిల్లాల నుంచి పీఈటీలు ఆర్.అర్జునరావు, నాంచారయ్య, స్టాలిన్, ఆర్య, కోచ్ చిరంజీవి పాల్గొన్నారు.

హెచ్ఐవీ దాచి.. వివాహం చేసుకోబోయిన వరుడు

- ఏపీ ఎన్‌జీవోస్ రాకతో నిలిచిపోయిన పెళ్లి
- ఎన్‌జీవోస్ ప్రతినిధులపై దాడి
- పోలీస్‌స్టేషన్‌కు చేరిన పంచాయితీ..



నిలిచిపోయిన పెళ్లి వద్ద జరుగుతున్న ఘర్షణ

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని క్రిస్టియన్‌పేటలోని ఓ చర్చిలో తాళికట్టే సమయానికి ఏపీ ఎన్‌జీవోస్ ప్రతినిధులు వచ్చి మంగళవారం ఓ వివాహాన్ని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా హెచ్ఐవీ డిస్ట్రిక్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్యామ్‌సన్ అందించిన వివరాలు.. 2013లో హెచ్ఐవీ పాజిటివ్ నిర్ధారణ అయి, ప్రస్తుతం 35 సంవత్సరాల వయసు ఉన్న ఓ యువకుడు ఆరోగ్యంగా ఉన్నాడు. అయితే ఓ యువతిని వివాహం చేసుకుంటున్నాడని తెలియడంతో ఆరోగ్యంగా ఉన్న యువతిని అనారోగ్యం బారిన పడకుండా కాపాడేందుకు ఏపీ ఎన్‌జీవోస్ మహిళా ప్రతినిధులు క్రిస్టియన్‌పేట వచ్చి చర్చి పాస్టర్‌కు వివరించారు. అమ్మాయి బంధువులతో పెళ్లి కొడుకుకు హెచ్ఐవీ ఉందని చెప్పడంతో వారు వివాహాన్ని నిలిపివేశారు. వివాహం నిలిపివేయడంతో పెళ్లికొడుకు బంధువులు పెళ్లికూతురు బంధువులతో గొడవకు దిగారు. వివాహం చేసే పాస్టర్, హెచ్ఐవీ పాజిటివ్ ఉంటే ఎలా వివాహం జరిపిస్తామని మాట్లాడడంతో పెళ్లికొడుకు బంధువులు అక్కడ ఉన్నవారిపై దాడికి పాల్పడ్డారు. ఏపీఎన్‌జీవోస్ అధికారులు మేము బహిరంగం చేయాలనుకోవడం లేదని, ఇక్కడ గొడవ చేయవద్దని మా వారు వేడుకున్నప్పటికీ వినకుండా వీరిపై దాడి చేశారని హెచ్ఐవీ డిస్ట్రిక్ ప్రాజెక్ట్ మేనేజర్ తెలిపారు. సమాచారం అందుకున్న తాడేపల్లి పోలీసులు, ఘటనా స్థలానికి వచ్చారు. మా సిబ్బందిపై దాడిచేసి ఫోన్‌లు లాక్కున్నారని, మా ఎన్‌జీవోస్ ఫోన్‌లు ఇప్పించాలని ఆయన పోలీసులను కోరారు.

మృతుల కుటుంబాలకు న్యాయం కోరుతూ రాస్తారోకో

ఆర్డీఓ హామీతో ఆందోళన విరమణ



పెదకాకాని పోలీసుస్టేషన్ ఎదుట రాస్తారోకో చేస్తున్న మృతుల కుటుంబాలు

పెదకాకాని: మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతూ మంగళవారం కుటుంబ సభ్యులు, యానాది హక్కుల పోరాట సమితి నాయకులు పెదకాకాని పోలీసుస్టేషన్ ఎదుట రోడ్డుపై బైఠాయించారు. విద్యుత్ షాక్‌తో మృతి చెందిన గంధాల మహంకాళరావు(28), ఏకుల రాజేష్(20), ఏటగిరి వెంకటబాలయ్య మృతి చెందిన సంగతి విదితమే. మృతదేహాలను స్వాధీనం చేసుకోకుండానే న్యాయం పోరాటం చేసేందుకు రోడ్డెక్కారు. పెదకాకాని పోలీసుస్టేషన్ ఎదుట వారితో మాట్లాడేందుకు డీఎస్పీలు కె.అరవింద్, మురళీకృష్ణ, తహసీల్దార్ పి.కృష్ణకాంత్, పెదకాకాని సీఐ టీపీ నారాయణస్వామి వారి వద్దకు చేరుకుని చర్చలు జరిపినప్పటికీ వారు స్పష్టమైన హామీ కోసం రోడ్డుపైనే బైఠాయించారు. మూడు గంటల తరువాత గుంటూరు ఆర్డీఓ కె. శ్రీనివాసరావు చేరుకుని మృతుల కుటుంబాలకు రెండు సెంట్ల స్థలం కేటాయించడంతో పాటు ప్రభుత్వం నుంచి ఇల్లు నిర్మించుకోవడానికి రుణం మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. మృతుల కుటుంబ సభ్యులకు తెనాలి మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం పనులు చేసే విధంగా ఉపాధి కోరడంతో అధికారులతో చర్చించడం జరుగుతుందని వివరించారు. దీంతో వారు ధర్నా విరమించి మృతదేహాలను స్వాధీనం చేసుకునేందుకు మార్చురీ వద్దకు బయలుదేరి వెళ్లారు. ధర్నాలో సంఘం నాయకులు యందేటి వెంకటసుబ్బయ్య, కొమ్మరగిరి సూరిబాబు, చౌటూరి రమేష్, తలపల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విజ్ఞాన్‌లో సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సినేషన్ ప్రోగ్రాం



విద్యార్థినులకు వ్యాక్సినేషన్ చేస్తున్న వైద్యులు

గుంటూరు రూరల్: పెదపలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ డిగ్రీ, పీజీ కళాశాలలో మంగళవారం రోటరీ క్లబ్, కళాశాల ఆధ్వర్యంలో సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా 1332 మంది విద్యార్థులకు ఉచితంగా వ్యాక్సినేషన్ అందించారు. మరలా ఆరు నెలల తరువాత 2వ డోసును ఉచితంగా అందించనున్నట్లు విజ్ఞాన్ సంస్థల సీఈఓ డాక్టర్ కూరపాటి మేఘన తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.అనూరాధ తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు అధ్యాపకులను విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అభినందించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ నారాకోడూరు ఇళ్ళ మధ్యలో వెంచర్, మెయిన్ రోడ్డు దగ్గర్లో 30అ.తారురోడ్డు, డ్రయినేజ్, విద్యుత్, స్వచ్ఛమైన వాటర్, స్పాట్ రి. చ.గజం రూ.14వేలు మాత్రమే. 8317528192

■ శివరాత్రి ఆఫర్: 8,50,000/- గలది 4,50,000/-కే. ప్రకాశం జిల్లా, కురిచేడులో 22 సెంట్లు 2 సం.గల 96 ఎర్రచందనం మొక్కలతో స్పాట్ రిజిస్ట్రేషన్. ✆ 920 666 6666

■ 100 చ॥గజాలు 1,50,000/- మాత్రమే 10 ఎర్రచందనం మొక్కలతో అద్దంకి దగ్గరలో పూర్తి డవలప్‌మెంట్స్, స్పాట్ రిజిస్ట్రేషన్. ఇన్‌స్టాల్‌మెంట్ సౌకర్యం కూడా కలదు ✆ 8143599989

SERVICES

MECHINARY FOR SALE

■ SPM కావీర్ పేపర్ ప్లేటర్ లోటస్ ఇంజనీర్స్ మిషనరీ SBI వేలం ద్వారా అమ్మబడును. ఫోన్ : 96529 95559, 93475 44565

■ లక్ష్మీపురంలోని Fleshazo రెస్టారెంట్ యధాతథంగా అమ్మకమునకు కలదు. మరియు బృందావన్ గార్డెన్స్, కోస్టల్ బ్యాంక్ పైన 2200Sft అద్దెకు కలదు: 7702513986, 9849094439

PASSPORT MISSING

■ నా పేరు మేరిగ శ్రీధర్ S/o మేరిగ రత్తయ్య R/o శారదా కాలనీ 11వ లైను, మల్లికార్జునపేట 5/3లైను గుంటూరు. ది.13-02-2025న నేను మా ఇంటి నుండి అరండల్‌పేట వెళ్ళుచుండగా మార్గమధ్యలో నా పేరిట గల ఒరిజినల్ పాస్‌పోర్ట్ నెం. L8714946 పోయినది. ఎవ్వరికైన దొరికినచో తెలపగలరు. సెల్ : 9381073028

WANTED

■ డ్యూటీ డాక్టర్స్, నర్సెస్, సూపర్‌వైజర్స్ కావలెను. కొత్త వారికి కూడా ప్రాధాన్యత. అహల్య నర్సింగ్ హోం, శివాలయం వెనుక, కొత్తపేట, గుంటూరు. 9246427459

■ కేర్‌టేకర్స్, నర్సులు కావలెను. విజయవాడలో పేషెంట్ల ఇళ్ళ వద్దనే ఉండి చూసుకొనుటకు ఆంధ్ర హోంకేర్ ఆఫీస్‌కి కావలెను. మంచి జీతం+వ+లో. ✆ 91608 35559, 78158 35561

■ గుంటూరు పేరేచర్ల పరిసర ప్రాంతాలలో ప్రముఖ టుబాకో కంపెనీలు, పారిశ్రామిక సంస్థలలో మా సత్యా ఇన్వెస్టిగేషన్ & సెక్యూరిటీ సర్వీసెస్ తరఫున పనిచేయుటకు గన్ లైసెన్స్ కలిగిన మాజీ సైనికులు మరియు అనుభవం ఉన్న సెక్యూరిటీ సూపర్వైజర్లు, సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. సూపర్‌వైజర్స్ అర్హతలు 30-45సం॥ ఇంటర్/డిగ్రీ, ఎత్తు 5.6 పైన రిటైర్డ్ ఆర్మీ, పారా మిలటరీ వారికి ప్రాధాన్యత. గార్డ్ అర్హతలు 23-45సం॥, 10, ఎత్తు 5.5 పైన లేబర్ యాక్ట్ ప్రకారం జీతం. ఆసక్తి గల వారు ఉ.11గం.నుండి మీ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో సంప్ర॥ బృందావన్ గార్డెన్స్, SBI ప్రక్కన, గుంటూరు. 7095125556, 0863-2351898

■ హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. Ph: 9640258899, 9640468899

■ హైదరాబాద్ స్టార్ హోటల్స్ మరియు షాపింగ్ మాల్స్‌లో అబ్బాయిలు & అమ్మాయిలు స్టాఫ్ కా. జీ : 15000 -20000 రూం+ఫుడ్ ఫ్రీ. 9441159460

గుంటూరు 7075167663 7075167541

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.